ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

అలంపూర్,సెప్టెంబర్ 3 : అలంపూర్ మండలం లింగనవాయి గ్రామానికి చెందిన వర లక్ష్మి అనారోగ్యానికి గురై మెరుగైన వైద్య సాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నది. ప్ర భుత్వం నుంచి ఆమెకు రూ.3లక్షల చెక్కు మంజూరు కాగా మంగళవారం ఎమ్మెల్యే విజయుడు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సిద్ధు, రఘు, దిలీప్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మహిళ కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

9న దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 3 : జిల్లా కేంద్రంలోని నూతనంగా నిర్మించనున్న 602 పడకల ప్రభుత్వ దవాఖాన నిర్మాణానికి ఈనెల 9న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ శంకుస్థాపన చేయనున్నారని, అందుకు ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మ్రికుంట వద్ద నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దవాఖాన భవన నిర్మాణం జరిగేచోట స్థలం చదును చేసి శిలాఫలకం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ, కళాశాల భవన గుత్తేదారుకు సూచించారు. అంతకుముందు వైద్య కళాశాల పనుల పురోగతిపై సమీక్షించారు. వైద్య కళాశాల నిర్మాణానికి నిధుల కొరత లేదని, ఇటీవలే పెండింగ్ బిల్లు మొత్తం చెల్లించామని త్వరగా పనులు పూర్తిచేయాలని గుత్తేదారును ఆదేశించారు. అదేవిధంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ తరగతి గదులతోపాటు బాలుర, బాలికల వసతి గృహాలు డిసెంబర్ వరకు పూర్తిచేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల డీఈ సీతారామస్వామి, తాసీల్దార్ చాంద్‌పాషా, ఏఈ , గుత్తేదారు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన క్రీడాకారులు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 3 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం జరిగే ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను చూసేందుకు బయల్దేరిన వనపర్తి ఫుట్‌బాల్ క్రీడాకారుల వాహనాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఫిపా వరల్డ్‌కప్ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లో భాగంగా ఇండియా వర్సెస్ మారిషస్ మధ్య పోటీ జరుగుతుందని ఈ మ్యాచ్‌ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే తన సొంత డబ్బులతో ఆరు వాహనాల్లో 80 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులకు మ్యాచ్ చూసేందుకు అవకాశం కల్పించినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ , స్కూల్ అండ్ గేమ్స్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేశ్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, సమన్వయకర్త సతీశ్, సత్యశీలారెడ్డి, పీడీ సురేందర్‌రెడ్డి, గంధం రాజశేఖర్, కృష్ణ బాబు, వెంకటేశ్, నాయకులు ఉన్నారు.

ఓటరు మర్జింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు మర్జింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పాన్‌గల్, సెప్టెంబర్ 3 : ఓటరు మర్జింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ తనిఖీ చేసి ఓటరు మర్జింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే వార్డులో ఓటు వినియోగించుకునే విధంగా జాబితా ఉండాలని సూచించారు. ఈనెల 6న అన్ని పోలింగ్ స్టేషన్లలో ఎలక్టోరల్ జాబితా ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్లు, స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో ఉమాదేవి, ఎంపీడీవో కోటేశ్వర్‌రావు, ఎంపీవో రఘురాములు, సీనియర్ అసిస్టెంట్ వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒకే సర్వే నెంబర్‌పై రెండు పాసుబుక్కులు

మల్దకల్, సెప్టెంబర్ 3 : మండలంలోని బిజ్వారం గ్రామ శివారులోని సర్వే నెంబర్ 538పై రెండు పాసుబుక్కులు రెవెన్యూ అధికారులు ఇవ్వడంపై దాసరిపల్లి గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి సోమవారం తాసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 538 ఖ, సర్వేనెంబర్‌లో ఎకరా భూమి ఉండగా ఈనెంబర్‌లో సర్వేశమ్మ పేరుపై ఎకరా, అదే సర్వేనెంబర్‌పై కొత్త కుంట సవారన్నపై మరో ఎకరా ఉన్నట్లు రెండు పాసుబుక్కులు అధికారులు ఇచ్చారన్నారు. కాగా ఇద్దరు వ్యక్తులు కూ డా బ్యాంక్‌ల్లో రుణాలు తీసుకున్నారని, అలాగే ఇద్దరికీ కూడా రైతుబంధు నిధులు వస్తున్నాయన్నారు. అందుకని ఈ సర్వే నెంబర్‌పై గల అసలు వ్యక్తిని గుర్తించి మోసం చేసి వ్యక్తి, అలాగే సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెద్దమందడి, సెప్టెంబర్ 3 : వర్షపు నీటి నిల్వతో దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని అందుకని ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. వనపర్తి మండలంలో అమ్మతాపురం, పెద్దమందడి మండలంలోని అంకాయపల్లి తండాలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. డ్రైడే కార్యక్రమం నిర్వహణతో పాటు అంకాయపల్లి తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల, పెద్దమందడి కస్తుర్భాగాంధీ బాలికల విద్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని పరిశీలించారు. అదేవిధంగా పెద్దమందడి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల ఇంటి మిద్దెలు, పాత టైర్లు, కుండలు, ఇతర ప్లాస్టిక్ సామాన్లలో నీరు నిల్వ ఉండకుండా పారవేసే విధంగా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు, వైద్య సిబ్బందికి సూచించారు. ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. కస్తుర్భాగాంధీ పాఠశాలలో ఉన్న మౌలిక వసతులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, విద్యార్థుల మెస్ కమిటీ ద్వారా సరుకుల నాణ్యత ధ్రువీకరణ చేయించి రిజిస్టర్‌లో సంతకాలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పీహెచ్‌సీలో పాముకాటు, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వర్షాల వల్ల నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికను త్వరగా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో పద్మావతి, డీఏవో గోవింద్‌నాయక్, జిల్లా వైద్య శాఖ అధికారి జయచంద్రమోహన్, జీసీడీవో శుభలక్ష్మి, వనపర్తి తాసీల్దార్ చాంద్‌పాషా, పెద్దమందడి తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, శివశంకర్, ఎంపీడీవోలు ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

అప్పు చెల్లించాలని వ్యక్తిపై దాడి

గట్టు, సెప్టెంబర్ 3 : అప్పు చెల్లించాలని వ్యక్తి పై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై కేటీ మల్లేశ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ధర్మారెడ్డి కొన్నేండ్ల కిందట మార్క్‌కు రూ.20 వేల అప్పు ఇచ్చాడు. అయితే ఆయన ఏటా వడ్డీ చెల్లిస్తున్నా డు. కాగా అసలుతోపాటు వడ్డీ చెల్లించాలని ధర్మారెడ్డి మా ర్క్‌పై ఒత్తిడి తీసుకొచ్చాడు. అయితే నగదు, వడ్డీ చెల్లించడానికి కొంత సమయం ఇవ్వాలని కోరాడు. దీనికి అంగీకరించని ధర్మా రెడ్డి మార్క్ ఇంటికి వెళ్లి అప్పు చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడమే కాకుండా కులం పేరుతో దూషిస్తూ అం దరూ చూస్తుండగా ఆయనపై దాడిచేశాడు. మార్క్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

- రూ.32వేలు, బైక్, మొబైల్స్ స్వాధీనం

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 3 : పేకాట స్థావరం దాడి చేయగా ఒకరు పట్టుబడగా 10 మంది తప్పించుకున్న ఘటన మంగళవారం రాత్రి గద్వాల మండలంలోని అనంతపురం,పూడూరు గ్రామాల శివారులో చోటు చేసుకున్నది. గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం మండల పరిధిలోని అనంతపురం,పూడూరు గ్రామాల శివారులో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారంతో ఎస్సీ ఆదేవాల మేరకు దాడులు నిర్వహించగా ఒకరు పట్టుబడగా మి గతా వారు పరారైనట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.32వేల నగదుతోపాటు బైక్, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లాడ్జీలపై ప్రత్యేక నిఘా

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 3 : జిల్లా కేంద్రంలోని లాడ్జీలతో పాటు ఇతర అనుమానిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని గద్వాల టౌన్ ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. లాడ్జీలలో పేకాట జోరుగా అడుతున్నారన్న విషయం తమ దృష్టికి రావడంతో సోమవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ అనుమానం ఉన్న కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. లాడ్జి రికార్డ్‌లు, ఆయా ప్రదేశాలను తనిఖీ చేశారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

అయిజ, సెప్టెంబర్ 3 : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శాంతినగర్ సీఐ టాటాబాబు పీస్ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవాలపై పీస్ కమిటీ సమావేశం ఎస్సై విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేశ్ మండపాలకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఇబ్బందులు కలుగకుండా తక్కువ శబ్దంతో లౌడ్ స్పీకర్లను ఉపయోగించాలని సూచించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకే స్పీకర్లను ఉపయోగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దేవన్న, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలంపూర్ మండలంలో..

అలంపూర్,సెప్టెంబర్ 3 : గణేశ్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ రవిబాబు అన్నారు. అలంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై భాషా అధ్యక్ష తన మంగళవారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేశ్ మండపాలు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మండల కమిటీ ఏర్పాటు

అలంపూర్‌లో మంగళవారం గణేశ్ ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సన్‌గౌడ్(ఊట్కూరు), ప్రధాన కార్యదర్శి సంజీవనాయుడు(అలంపూర్) సభ్యులుగా మరో 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ

పెబ్బేరు, సెప్టెంబర్ 3 : పెబ్బేరు మున్సిపాలిటీకి చెందిన రెండో వార్డు కౌన్సిలర్ అక్కమ్మ మంగళవారం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కిష్టారెడ్డిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆమె తన సొంత ఖర్చులతో సమకూర్చి వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో జయరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటపొలాలు

- ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

అమరచింత, సెప్టెంబర్ 3 : నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో అమరచింత పెద్ద చెరువు నిండి అలుగు పారడంతో కొంత మంది రైతుల పంటపొలాలు నీట మునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అమరచింత ఒకటో వార్డుకు చెందిన సయ్యద్‌మన్నన్ తన రెండు ఎకరాల పొలంలో వరి సాగు చేయగా చెరువు అలుగు నీటితో పంట మొత్తం నీటి పాలైంది. దీంతో రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అమరచింత పెద్ద చెరువు అలుగు పరడంతో వర్షపునీటితో నీటి మునిగిన పంటపొలాలు

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, సెప్టెంబర్ 3 : 2024-25 విద్యాసంవత్సరంలో జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణతను సాధించడం మన ప్రధాన లక్ష్యమని కలెక్టర్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, మండల పరిపాలన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలన్నారు. గతంలో పది ఫలితాల్లో రాష్ట్రంలో చివరిగా నుంచి జిల్లా రెండో స్థానాన్ని నిలిచిందని గుర్తు చేశారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి యూనిఫామ్ కచ్చితంగా ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడంలో ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. త్వరలో విద్యా వలంటీర్లను నియమించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో ఎంఈవో ఇతర పాఠశాలల నుంచి అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అక్టోబర్‌లో విద్యార్థుల సమ్మెటివ్ పరీక్షల మార్కుల ఆధారంగా రివ్యూ నిర్వహిస్తామని తెలిపారు. ఫలితాలు మెరుగు పర్చేందుకు సబ్జెక్ట్ వారీగా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఉపాధ్యాయులు అందరూ రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అధికారులు కాంతమ్మ, ప్రియాంక, రమేశ్‌బాబు, అక్బర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

మైనార్టీలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

గద్వాల,సెప్టెంబర్ 3: మైనార్టీలకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందని, వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గద్వాల మండలం, మున్సిపాలిటీకి చెందిన 47మంది లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు మురళి, నరహరి శ్రీనివాసులు, దౌలు, పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్, నాయకులు రామన్‌గౌడ్, గడ్డం కృష్ణారెడ్డి, రమేశ్ నాయుడు, ప్రతాప్‌గౌడ్, గోపిరెడ్డి, గోవింద్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

ధరూరు, సెప్టెంబర్ 3 : షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని మార్లబీడు గ్రామానికి చెందిన డబ్బ నర్సింహులు నిర్వహించే కిరాణ జనరల్ స్టోర్ సోమవారం రాత్రి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి యజమాని నర్సింహులును పరామర్శించారు. ప్రభుత్వం తరపున సాయం అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్ విజయ్‌కుమార్, శ్రీరాములు, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

మానవపాడు ,సెప్టెంబర్ 3 : విద్యార్థుల బోధనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే అమరవాయి యూపీఎస్, మానవపాడు కేజీబీవీలను తనిఖీ చేశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనంపై అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బోధనలో కొత్త,కొత్త పద్ధతులు పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేపట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో శివప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మానవపాడు పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచాలి

నిరసన తెలుపుతున్న కార్మికులు

గద్వాల, సెప్టెంబర్ 3 : గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్రామిరెడ్డి, కురుమన్న, రామునాయక్, భీసన్న, నల్లస్వామి, చంద్రాములు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి అనంతరం డీపీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, నర్సరీ, ట్రాక్టర్‌డ్రైవర్స్, వాటర్‌మెన్, ఆఫీస్ నిర్వహణ సిబ్బంది, ఎలక్ట్రిషన్, బిల్‌కలెక్టర్లను కేటగిరీలుగా విభజించి వేతనాలు పెంచాలని పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2021 జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలని కోరారు. విధినిర్వహణలో మృతిచెందిన కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని తదితర డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

విద్యలో ఉన్నతస్థానానికి ఎదగాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య

పాన్‌గల్, సెప్టెంబర్ 3: విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పర్చుకొని విద్యలో ఉన్నత స్థానానికి ఎదగాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్ డేకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఫస్టియర్ విద్యార్థులను సెకండియర్ విద్యార్థులు స్వాగతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డ్యాన్స్‌లతో కళాశాల ప్రాంగణమంతా మార్మోగింది. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు

కొత్తకోట, సెప్టెంబర్ 3 : మండలంలోని కనిమెట్ట– పాతజంగమయాపల్లి గ్రామాల మధ్య ఊక చెట్టు వాగుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద మంగళవారం మాజీ ఎంపీపీ గుంతమోనిక గంగమ్మ తల్లికి కుంకుమ, పసుపు, పూలు నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు గుంత మల్లేశ్, బాలరాజు, రాంచంద్రయ్యాదవ్, కృష్ణకుమార్, పరమేశ్, సురేశ్, ప్రభాకర్‌రెడ్డి , కొల్లంపల్లి, సంజీవాచారి, శివచారి, కొండన్న, జైపాల్‌రెడ్డి ఉన్నారు.

భూత్కూర్‌లో ..

మండలంలోని అమడబాకుల, భూత్కూర్ వద్ద ఉన్న బ్రిడ్జి వద్ద మంగళవారం జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ గుంతమోనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డిలు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాముయాదవ్, సురేంద్రచారి, శశిరెడ్డి, కొల్లంపల్లి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడానికి తరలి వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఉపకార వేతనాలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 3 : 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఈపాస్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సుషిత మంగళవారం ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులు కొత్త, రెన్యువల్ ఉపకార వేతనాల కోసం ఫీజు, మెయింటెనెన్స్ చార్జీలను పొందేందుకు ఈపాస్ వెబ్‌సైట్ http:// telanganaepass. cgg. gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సంబంధిత ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు సమాచారం అందజేసి బయోమెట్రిక్ సరిచేసుకొని రిజిస్ట్రేషన్ చేసేలా చూడాలన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 3 : దశాబ్దాలుగా పెరుకుపోయిన స్కాలర్‌షిప్, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జున్ ప్రభుత్వాన్ని మంగళవారం ప్రకటనలో కోరారు.

పాత ఇండ్లలో ఉండొద్దు

కొత్తకోట, సెప్టెంబర్ 3 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పాత ఇండ్లలో ఉండి ప్రాణం మీదికి తెచ్చుకొవద్దని తాసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. మండల వ్యాప్తంగా 8ఇండ్లు కూలినట్లు ఆయన తెలిపారు. వడ్డెవాటలో2, నాటవెల్లిలో2, చర్లపల్లిలో3,కనిమెట్ట గ్రామంలో1 ఇండ్లు కూలినట్లు ఆయన తెలిపారు.

పరిహారం అందించాలి

పాన్‌గల్, సెప్టెంబర్ 3: భారీ వర్షాలకు ఇండ్లు, పంటలు, ఆస్తులు కోల్పోయిన వారికి యుద్ధప్రాతిపదికన సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు శ్రీరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వివిధ కేరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో 114 ఇండ్లు పాక్షికంగా, ఒక ఇల్లు పూర్తిగా కూలిపోయిందన్నారు. అంతేకాకుండా పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయని, తక్షణమే ఎకరాకు రూ.20వేల పంటనష్ట పరిహారం అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ, కాశన్న, కురువ హన్మంతు, పరశురాముడు, రాముడు, ఎల్లయ్య పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 3 : వరదలో పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డీ జబ్బార్ కోరారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో జిల్లాలో వరి పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు వెంటనే ఇవ్వాలని, ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం రైతులకు అందించాలన్నారు. ఇండ్లు కూలిపోయిన వారికి ఇందిర ఆవాస్ యోజన కింద కొత్త ఇల్లు నిర్మాణం చేయాలని, తక్షణ సహాయం కింద రూ.లక్ష మంజూరు చేయాలన్నారు. పాన్‌గల్ మండలం చిక్కడపల్లి గ్రామంలో మహిళ వాగులో కొట్టుకుపోయి చనిపోయిందని వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్ కాల్వ దెబ్బతిన్నదని. వనపర్తి పట్టణంలో ప్రధాన రోడ్డు గుంతలమయమైందని వెంటనే